ఎస్‌కెయు విసి కె.హుస్సేన్‌రెడ్డి

జెఎన్‌టియు విసి జివిఆర్.శ్రీనివాసరావు

ఎస్‌కెయు, జెఎన్‌టియుకు

నూతన విసిల నియామకం

ప్రజాశక్తి-అనంతపురం

శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ, అనంతపురం జెఎన్‌టియుకు నూతన విసిలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించింది. అనంతపురం శ్రీకష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం నూతన ఉపకులపతిగా ఎస్‌కెయు కెమిస్ట్రీ విభాగం ఆచార్యులు కె.హుస్సేన్ రెడ్డి, అనంతపురం జెఎన్‌టియు నూతన ఉపకులపతిగా విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీ సివిల్ ఇంజినీరింగ్ ఆచార్యులు జివిఆర్.శ్రీనివాసరావును నియమిస్తూ రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ బుధవారం నాడు ఉత్తర్వులు వెలువరించారు. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ ప్రధాన కార్యదర్శి జె.శ్యామలారావు జీవో 6, 8 ద్వారా ద్వారా ఉత్తర్వులు జారీచేశారు. గత నెలలో ఎస్‌కెయు ఉపకులపతి మాచిరెడ్డి రామకృష్ణరెడ్డి పదవీకాలం ముగిసింది. అప్పటి నుంచి ఇన్‌ఛార్జి ఉపకులపతిగా యోగివేమన యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య సుధాకర్ కొనసాగుతున్నారు. సెర్చ్ కమిటీ ప్రతిపాదన మేరకు ఎస్‌కెయు కెమిస్ట్రీ విభాగం సీనియర్ ఆచార్యులు కె.హుస్సేన్ రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులర్ ఉపకులపతిగా నియమించింది. ఇక జెఎన్‌టియుకు సంబంధించి విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీ సివిల్ ఇంజినీరింగ్ ఆచార్యులు జివిఆర్.శ్రీనివాసరావు నియమితులు అయ్యారు. ఇప్పటి వరకు ఉన్న ఆచార్య రంగజనార్ధన పదవీకాలం బుధవారంతో ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రెగ్యులర్ ఉపకులపతిగా జివిఆర్.శ్రీనివాసరావును నియమించింది.

ఇన్సెంటివ్‌ల విడుదల, ఎన్నికల హామీల అమలు కోసం పట్టు రైతులు మరోసారి ఆందోళనబాట పట్టారు. 2019 నుంచి ఇప్పటి వరకు పట్టు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన ఇన్సెంటీవ్ ఇప్పటి వరకు విడుదల చేయలేదు. ఇన్సెంటీవ్(ప్రోత్సాహం) విడుదల చేయాలని పదుల సార్లు ప్రభుత్వ పెద్దలను రైతులు కలిసినా ప్రయోజనం దక్కలేదు. ఇప్పటికే పలుమార్లు ఆందోళన కార్యక్రమాలు చేపట్టినా ఫలితం లేక పోవడంతో బుధవారం నుంచి మరోసారి రాష్ట్ర వ్యాప్తంగా పట్టుగూళ్ల మార్కెట్లను బంద్ చేసి పట్టు రైతులు ఆందోళన బాట పట్టారు.

పట్టు గూళ్లు రాక నిర్మానుష్యంగా ఉన్న హిందూపురం మార్కెట్

హామీలు అమలయ్యే(పే)ట్టు..!

- పట్టు రైతుల ఆందోళనబాట
- రాష్ట్ర వ్యాప్తంగా మార్కెట్లు బంద్
- ఇన్సెంటివ్‌లు విడుదల చేయాలని డిమాండ్
- రూ.66 కోట్లు పెండింగ్

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో వేరుశనగ, మొక్కజొన్న ప్రధాన పంటలు. వీటికి ప్రత్యామ్నాయంగా పట్టును సాగు చేస్తూ రైతులు జీవనోపాధి పొందుతున్నారు. హిందూపురం పార్లమెంట్ పరిధిలోని 7 నియోజకవర్గాల్లో ఎక్కువగా పట్టు సాగు ఉంది. గతకొన్ని సంవత్సరాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంతో పట్టుకు ప్రోత్సాహం తగ్గింది. సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో తాము అధికారంలో వచ్చిన వెంటనే పట్టు రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టు రైతులను పట్టించుకోలేదు. పట్టురైతులకు ప్రభుత్వం నుంచి విడుదల కావాల్సిన ఇన్సెంటీవ్ 2019 నుంచి ఇప్పటికీ రాలేదంటే వీరిపై ప్రభుత్వానికి ఏ పాటి ప్రేమ ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇన్సెంటీవ్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ రైతులు బుధవారం నుంచి పట్టుగూళ్ల మార్కెట్‌ను బంద్ చేసి నిరవధిక దీక్షలు చేపట్టారు. వీరికి రీలర్లు సైతం మద్దతుగా నిలుస్తున్నారు.

హిందూపురం పట్టుగూళ్ల మార్కెట్‌కు ప్రతి రోజూ 12 నుంచి 15 టన్నుల పట్టుగూళ్లు వస్తుంటాయి. రోజుకు రూ.40 నుంచి రూ.50 లక్షల వరకు లావాదేవీలు జరుగుతుంటాయి. పట్టుకు ప్రభుత్వం ప్రోత్సహకంగా సిబికి రూ.10, బైవోల్టీన్‌కు రూ.50 అందిస్తుంది. తెలంగాణలో బైవోల్టీన్‌కు రూ.75 ప్రోత్సహకంగా ఇస్తున్నారు. మన రాష్ట్రంలో ఇస్తున్నది తక్కువ అయినా దానిని కూడా సక్రమంగా ఇవ్వడం లేదు. రీలర్లుకు ఒక కిలో పట్టుదారం తయారు చేసి విక్రయిస్తే దానికి ప్రోత్సాహకం కింద రూ.130 ఇస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం మల్టీయన్ రీలర్లకు కిలోకు రూ.130 నుంచి 200, చర్కా రీలర్లకు రూ.35 నుంచి రూ.100కు పెంచి ఇవ్వాల్సి ఉంది. ఈ హామీ కూడా అమలుకావడం లేదు. రీలింగ్ యూనిట్లు, ట్విస్టింగ్ యూనిట్లు ఏర్పాటు చేసుకోవడానికి రాయితీ రుణాలు, సోలార్ సిస్టమ్ ద్వారా యూనిట్లకు బాయిలర్, యూనిట్లకు విద్యుత్ సరఫరా చేయాలని రైతులు, రీలర్లు కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

రూ.66 కోట్ల మేర నిలిచిన ఇన్సెంటీవ్‌లు

రాష్ట్ర వ్యాప్తంగా ఏడు పట్టు గూళ్ల మార్కెట్‌లు ఉన్నాయి. ఇందులో హిందూపురం, పలమనేరు మార్కెట్‌లు పెద్దవి. వీటితో ఆపటు కదిరి, ధర్మవరం, చిత్తూరు జిల్లాలో కుప్పం, మదనపల్లి మార్కెట్‌లు ఉన్నాయి. ఈ మార్కెట్‌లో పట్టు గూళ్లు విక్రయించిన పట్టు రైతులకు ఒక కిలో బైవోల్టీన్‌కు రూ.50, సిబికు రూ.10 ఇన్సెంటీవ్ ఇవ్వాల్సి ఉంది. దీంతో పాటు రీలర్లకు ఒక కేజి దారం తీసి విక్రయిస్తే వారికి రూ.150 ఇన్సెంటీవ్ ఇవ్వాలి. ప్రభుత్వం పట్టు రైతులకు ఇవ్వాల్సిన ఈ ప్రోత్సహకాలు 2019 ఆగస్టు నుంచి ఇప్పటి వరకు విడుదల చేయలేదు. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఒక్క హిందూపురం పట్టు గూళ్ల మార్కెట్‌లోనే రూ.20కోట్లు, రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.66 కోట్లు పట్టు రైతులు, రీలర్లకు ఇన్సెంటీవ్ రావాల్సి ఉంది. గతంలో పట్టు రైతులకు ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకాలను కూడా ఈ ప్రభుత్వం నిలిపేసింది.

మార్కెట్ ముందు దీక్ష చేస్తున్న పట్టు రైతు సంఘం నాయకులు, రైతులు

సమస్యలు పరిష్కరించే వరకు బంద్

పట్టు రైతులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలనూ ప్రభుత్వం పరిష్కరించే వరకు బంద్ కొనసాగిస్తాం. ఇప్పటి వరకు బకాయి ఉన్న ప్రోత్సహకాలు, రైతులకు అవసరమైన పరికారాలు, క్రిమి సంహారక మందులు, షెడ్డు నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించాలి. రైతులకు అందిస్తున్న ప్రోత్సహాకాలను పెంచాలి. లేని పక్షంలో అన్ని సంఘాలను కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తాం.

బడా సుబ్బిరెడ్డి,
పట్టు రైతు సంఘం రాష్ట్ర నాయకులు.

ప్రజలకు నమస్కరిస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్

జగన్ ప్రభంజనాన్ని ఆపలేరు : మంత్రి

ప్రజాశక్తి రొద్దం

చంద్రబాబు తన దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్, తోక పార్టీలతో జత కట్టినా జగనన్న ప్రభంజనాన్ని ఆపలేరనిరాష్ట్ర శిశు శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని వివిధ గ్రామాలలో వైసిపి నాయకుల కార్యకర్తలతో కలసి పర్యటించారు. కందుకూర్లపల్లి, చిన్నకోటిపల్లి, కల్లకుంట, నల్లూరు, చోలేమర్రి, బూదిపల్లి, గుబ్బరంపల్లి, సానిపల్లి తదితర గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్ జగన్ మరోసారి ముఖ్యమంత్రి కావడం తధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పద్మాఅక్కులప్ప, ఎంపీపీ చంద్రశేఖర్, రాష్ట్ర స్వచ్ఛంద్ర కార్పొరేషన్ డైరెక్టర్ బి నారాయణ రెడ్డి, మారుతి రెడ్డి, అక్కులప్ప, సి నారాయణ రెడ్డి, ఎన్ నారాయణరెడ్డి, పుప్పం సుధాకర్ రెడ్డి,మండల కన్వీనర్ తిమ్మయ్య, ధనుంజయ రెడ్డి, సర్పంచులు కిష్టప్ప, పరమేష్, గంగాధర్, నాయకులు కిష్టప్ప, సానిపల్లి కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితుల పక్షాన పోరాటం

- బెల్,నాసిన్ భూ నిర్వాసితులకు న్యాయం చేయాలి
- 22న ఎపిఐఐసి కార్యాలయం వద్ద ధర్నా
- సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్

ప్రజాశక్తి -పెనుకొండ

పెనుకొండ నియోజకవర్గం గోరంట్ల మండలం పాలసముద్రం వద్ద ఏర్పాటు చేసిన బెల్, నాసన్ సంస్థల భూ నిర్వాసితులకు పునరావాసం, నష్ట పరిహారం చెల్లించాలని కోరుతూ వారి పక్షాన పోరాటం నిర్వహిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం. ఇంతియాజ్ తెలిపారు. ఎపిఐఐసి జోనల్ ఆఫీస్ వద్ద బెల్, నాసన్ భూ నిర్వాసితులకు రావాల్సిన పునరావాసం, నష్ట పరిహారం విషయమై మేనేజర్ మల్లికార్జునను బుధవారం కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ మంగళవారం నాడు నాసిన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ప్రదాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిలు నిర్వాసితుల సమస్యలపై మాట్లాడకపోవడం విచాకరం అన్నారు. నాసిన్, బెల్ నిర్మాణాలు పూర్తి అయిన భూములు ఇచ్చిన రైతులకు మాత్రం ఇప్పటికీ నష్టపరిహారం, పునరావాసం అందలేదన్నారు. ఇచ్చిన నష్ట పరిహారంలో కూడా వివక్ష ఉందన్నారు. ఇందులో దళితులు పూర్తిగా నష్టం జరిగిందన్నారు. ఈ అన్యాయంపై తహశీల్దార్ మొదలుకుని జిల్లా కలెక్టర్ వరకు అనేక విజ్ఞప్తులు చేసినా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత మూడు సంవత్సరాలు నుంచి నిరసనలు చేస్తున్నా ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధుల నుంచి కనీస స్పందన లేకపోవడం విచాకరం అన్నారు. పునరావాసం చెల్లింపులకు ఎపిఐఐసి అధికారులను రెండు నెలల నుంచి స్పంప్రదిస్తున్నా ఏవో కారణాలు చెప్పుతూ కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకుని బాధిత రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ అభివద్ధి కోసం భుములు ఇచ్చి త్యాగం చేసిన పేద రైతులను మోసం చేయడం అన్యాయం అన్నారు. నాసిన్, బెల్‌కు భూములిచ్చి జీవనోపాధి కోల్పోయిన రైతులు రోడ్డున పడ్డారన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం పెంపుదల, పునరావాసం కోసం కోర్టును ఆశ్రయించగా కోర్టు రైతుల పక్షాన తీర్పు ఇచ్చిందన్నారు. 2018లో రైతులకు న్యాయం చేయాలని కోర్టు ఉత్తర్వులు వచ్చినప్పటికీ ఇంతవరకు ఆదిశగా అధికారులు చర్యలు తీసుకోలేదన్నారు. పెనుకొండ సబ్ కలెక్టర్ 2022న భూ నిర్వాసితులకు పునరావసం చెల్లించాలని ఆదేశించినా ఎపిఐఐసి అధికారులు పట్టించుకోక పోవడం దుర్మార్గమన్నారు. ఇదే విషయమై ఏపీఐఐసీ జోనల్ మేజర్ మేనేజర్‌ను స్పందిస్తే వివరాలను ఎమ్‌డికి పంపామని చెప్పి చేతులు దులిపేసుకుంటున్నారన్నారు. రైతులకు న్యాయం చేయకుంటే వారి పక్షాన సిపిఎం, వ్యకాసం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, జిల్లా కమిటీ సభ్యులు నారాయణ, వెంకట్రాముడు, భూ నిర్వాసితులు వెంకట్రామిరెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

ఎపిఐఐసి జోనల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎంనాయకులు, నిర్వాసితులు

22న ధర్నా

ఈ నెల 21వ తేదీ లోపు అధికారులు భూ నిర్వాసితులకు న్యాయం చేయకుంటే ఈ నెల 22వ తేదీ సోమవారం తుంగోడు, పాలసముద్రం గ్రామాలకు చెందిన భూ నిర్వాసితులతో కలిసి 24 గంటల పాటు ఎపిఐఐసి జోనల్ కార్యాలయం వద్ద వంటావార్పుతో ధర్నా నిర్వహిస్తామని వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న తెలిపారు. అధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

'నీళ్లు'నమిలిన అధికారులు..!

- తాగునీటిపై జెడ్పిలో వాడీవేడి చర్చ
- ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇని సరెండర్ చేయాలని డిమాండ్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

తాగునీటి బిల్లుల విషయంలో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారంటూ జెడ్పీ సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఆరోపించారు. తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తాగునీటిపై జెడ్పీ సర్వసభ్య సమావేశంలో వాడీవేడిగా చర్చ నడిచింది. అనేక వాయిదాల అనంతరం బుధవారం నాడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఉమ్మడి జిల్లా జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అనంతపురం జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి, అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, పెనుకొండ ఎమ్మెల్యే శంకర నారాయణ, కదిరి ఎమ్మెల్యే సిదారెడ్డి, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశరెడ్డి, సిఇఒ వైఖోము నిదియా తదితరులు పాల్గొన్నారు. గ్రామీణ తాగునీటిపై మొదట చర్చ ప్రారంభమైంది. ఆర్‌డబ్ల్యూఎస్ పరిధిలో వివిధ తాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ కాంట్రాక్టు గడువులు ముగిశాయని తెలిపారు. సప్లిమెంటరీ కాంట్రాక్టు గడువు పెంపును సస్పెండ్ అయిన సిఇఒ చేత సంతకాలు చేసుకుని కొన్నింటిని పొడిగించారని తెలిపారు. మరికొన్నింటి మాత్రం పొడిగించలేదని అన్నారు. ఈ రకంగా ఎందుకు చేసారో చెప్పాలని అధికారులను సభ్యులు ప్రశ్నించారు. బిల్లుల విషయంలోనూ సీనియారిటీ ప్రాతిపదిక ఏదీ లేకుండా ఉందన్నారు. అధికారులు తమ ఇష్ట ప్రకారం బిల్లులు చేస్తున్నారని మండిపడ్డారు. యల్లనూరు జడ్పిటిసి మాట్లాడుతూ తమకు సంబంధించి రెండు సంవత్సరాల క్రితం చేసిన పనులకు బిల్లులు అవలేదని అన్నారు. కొన్నింటికి మాత్రం ఆరు మాసాల బిల్లులు వచ్చేయని తెలిపారు. ఈ రకంగా ఎందుకు జరుగుతుందో అధికారులు చెప్పాలని నిలదీశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇని సరెండర్ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ గౌతమి మాట్లాడుతూ ఈ విషయాలపై విచారణ చేపట్టి తప్పుంటే తప్పకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదే విధంగా బడ్జెట్ ఉన్న మేరకు ప్రాధాన్యత క్రమంలో బిల్లులు చెల్లిస్తామని సభ్యులకు చెప్పారు. అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వచ్చే వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందు నుంచి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్ బిల్లులు నిధులు రావాల్సిన ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే ప్రభుత్వానికి తెలియజేస్తామని చెప్పారు. పెనుకొండ ఎమ్మెల్యే శంకర నారాయణ మాట్లాడుతూ మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు ఈసారి నీళ్ల వదలి ఉంటే బాగుండేదని చెప్పారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కనీసం భూగర్భజలాలు అయినా పెరిగి ఉండేవని తెలిపారు. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ కింద 13 గ్రామాలకు తాగునీటిని అందించేందుకు రూ.2.90 కోట్ల టెండర్లు పిలవాల్సి ఉందన్నారు. వెంటనే పిలిచే విధంగా ఆర్‌డబ్లుఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచిచారు. 122 గ్రామాలకు తాగునీటిని అందించేందుకు పార్ట్ ఎ, పార్టు బి కింద పిలవాల్సిన టెండర్లు ఇంకా పిలువలేదని, వెంటనే పిలిచి పనులు ప్రారంభమయ్యే విధంగా చూడాలని అధికారులను కోరారు. కదిరి నియోజకవర్గంలో ఆరు మండలాల్లో 2590 మంది రైతులకు సంబంధించి 3600 ఎకరాలు అసైన్డు భూమికి పట్టాలివ్వాల్సి ఉందన్నారు. జెసి, ఆర్డీవోల వద్ద ఈ ఫైల్ పెండింగులో ఉందన్నారు. త్వరలో ఎన్నికలు రానున్నాయి. నోటిఫికేషన్ వస్తే భూ పంపిణీ చేయడానికి వీలుండదని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తక్షణం అసైన్డు భూముల పంపిణీ ఫైల్‌ను క్లియర్ చేయాలని కోరారు. 90 రోజుల్లోపు జరగాల్సిన జెడ్పీ సర్వసభ్య సమావేశం 130 రోజుల తరువాత నిర్వహించడాన్ని ఆగళి జడ్పిటిసి తప్పుబట్టారు. సమావేశం నిర్వహించకపోతే తమ సమస్యలు ఎవరితో చెప్పుకోవాలని నిలదీశారు. ఇంకా పలువురు సభ్యులు వారి ప్రాంత సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు.

జెడ్పీ సమావేశంలో పాల్గొన్న జెడ్పీ ఛైర్‌పర్సన్, కలెక్టర్ తదితరులు

సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు శంకరనారాయణ, అనంత వెంకటరామరెడ్డి, సిద్ధారెడ్డి

గుంతలు పూడుస్తారా.. పూడ్చుకోమంటారా..?

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పట్టణంలో రోడ్లపై ఏర్పడిన గుంతల రోడ్లను పూడ్చుతారా లేదా అనుమతిస్తే తమ నాయకుడు మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ ఆధ్వర్యంలో పూడ్చుకోమంటారా అని గోనుగుంట్ల అనుచరులు ఆర్అండ్‌బి అధికారులను బుధవారం ప్రశ్నించారు. మున్సిపాలిటీలో మోకాళ్ల లోతుగల గుంతలు ఏర్పడ్డాయని వాటిని పూడ్చాలని లేకపోతే తామే పూడ్చుకుంటామని అందుకు అనుమతి ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల అనుచరులు ఆర్అండ్‌బీ డీఈ నాగపుల్లమరావుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా గోనుగుంట్ల అనుచరులు మాట్లాడుతూ గుంతల మయమైన రోడ్లతో ప్రజలు నరకయాతన పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధకారులు స్పందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గోనుగుంట్ల అనుచరులు డిష్ రాజు, చిగిచెర్ల అరవిందరెడ్డి, గొట్లూరు చంద్ర, చిలకంసూర్యనారాయణరెడ్డి, నబీరసూల్, సరితాల దస్తగిరి, పల్లాగోపాలక్రిష్ణ, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కేంద్రం అనాలోచిత చట్టాలను ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి-హిందూపురం

కేంద్ర ప్రభుత్వం అనాలోచితంగా తీసుకొచ్చిన మోటార్ వాహనాల చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆటో డ్రైవర్స్, ట్రక్ డ్రైవర్స్ అసోసియోషన్ నాయకులతో పాటు కాంగ్రెస్, టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తు లారీ డ్రైవర్లు హెల్పర్స్, ఆటో డ్రైవర్స్, ఆల్ ఇండియా ట్రక్ డ్రైవర్స్ హెల్పర్స్ అసోసియేషన్ ఆద్వర్యంలో బుధవారం పట్టణంలోని అల్ హి లాల్ పాఠశాల ఆవరణం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, కార్యాలయం ఎదుట ఆందోళన చేసి, తహశీల్దార్‌కు వినతిని ఇచ్చారు. చట్టాన్ని ఉపసంహరించకోక పోతే దేశ వ్యాప్తంగా అన్ని కార్మిక, ప్రజా సంఘాలతో పాటు రాజకీయ పార్టీలను కలుపుకుని దేశ వ్యాప్తంగా ఆందోళన చేయడంతో పాటు రవాణాను నిలిపివేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు శివ శంకర్, కాంగ్రెస్ నాయకులు బాలాజి మనోహర్, అమానుల్లా, జమీల్, రామాంజినేయులు, తిరుపాల్, టిడిపి శివ శంకర్, లారీ వర్కర్స్ అసోసియేషన్ నాయకులు అబ్బాస్, అయూబ్, భాస్కర్, ఖాజా, నంజుండప్ప, సిద్దిఖ్, అనిల్, బాషా, అంజాద్, రహమత్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

106 జీవో రద్దుకు డిమాండ్

ప్రజాశక్తి - కదిరి టౌన్

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 106 జీవోను రద్దు చేయాలనీ డ్రైవర్ల అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా తీసుకొచ్చిన చట్టం డ్రైవర్లకు వ్యతిరేకంగా ఉందని అన్నారు. ఇలాంటి చట్టాల వల్ల డ్రైవర్లు తమ వృత్తికి దూరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు మంత్రులు స్పందించి జీవోపై సవరణలు చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాబా ఫక్రుద్దీన్, వాల్మీకి డ్రైవర్ అసోసియేషన్ కదిరి సెక్రెటరీ అబ్దుల్ రజాక్, వైస్ ప్రెసిడెంట్ బాబ్జాన్, ట్రెజరీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలంటూ ధర్నా

గోరంట్ల : పట్టణంలో చౌడేశ్వరి కాలనీలో వీధిలో తొలగించిన పబ్లిక్ తాగునీటి కొళాయిలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ కాలనీవాసులు బుధవారం ధర్నా నిర్వహించారు. జనసేన పార్టీ నాయకులు సురేష్, సంతోష్, వెంకటేష్ ఆధ్వర్యంలో చౌడేశ్వరి కాలనీవాసులు స్థానిక ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ వీధిలో ఎన్నో రోజుల నుండి ఉన్న పబ్లిక్ కొళాయిలను ఉన్నఫలంగా తొలగించడం వల్ల నీటి సమస్య ఏర్పడిందన్నారు. గ్రామపంచాయతీ అధికారులు నీటి కొళాయిలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు సర్పంచు సరోజ నాగే నాయక్, పంచాయతీ అధికారులు మాట్లాడుతూ పబ్లిక్ కొళాయిలను పునరుద్ధరిస్తామని హామీ ఇవ్వటంతో కాలనీ వాసులు ఆందోళన విరమించారు.



ఖాళీబిందెలతో మహిళల ధర్నా

నవోదయ ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తచెరువు - 2024 - 25 విద్యా సంవత్సరానికి గాను జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఆరవ తరగతి ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి తెలిపారు ఈనెల 20వ తేదీ ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ప్రభుత్వం చేత గుర్తింపు పొందిన ప్రయివేటు, ప్రభుత్వ పాఠశాలల్లో ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు

నేడు జయహో బీసీ

ఓబుళదేవర చెరువు : మండలంలోని కొండకమర్లలో గురువారం జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టిడిపి మండల కన్వీనర్ జయచంద్ర తెలిపారు. గురువారం ఉదయం కొండకమర్లలోని నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించి అనంతరం బైక్ ర్యాలీని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ప్రారంభిస్తారన్నారు. బైక్ ర్యాలీ కొండకయర్ల నుండి కుసుమారుపల్లి, గాజుగుంటపల్లి, ఇనుగులూరు, తుమ్మలకుంట్లపల్లి, వెంకటాపురం, ఓడి చెరువు మీదుగా తంగేడుకుంట, గౌనిపల్లి మీదుగా కొండకమర్లకు చేరుకుంటుందన్నారు. మధ్యాహ్నం 1 గంటలకు కొండకమర్లలో బీసీ జయహో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

19న చలో విజయవాడ

పుట్టపర్తి అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలో వివిధ పనులు చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 19న చలో విజయవాడ కార్యక్రమం చేపట్టినట్లు మున్సిపల్ కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, సిఐటియు పట్టణ కార్యదర్శి పైపల్లి గంగాధర్ తెలిపారు. ఈ మేరకు వారు బుధవారం ఇంజనీరింగ్ సెక్షన్ కార్మికులతో మున్సిపల్ కార్యాలయం ముందు చర్చలు నడిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వివిధ పనులు చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు ప్రభుత్వం ప్రకటించిన జీవోలపై విజయవాడలో రాష్ట్ర సదస్సు జరుగుతుందన్నారు. ఈ సదస్సులో రాష్ట్ర నాయకులు ఉమామహేశ్వరరావు ఆయా జిల్లాల నాయకులు పాల్గొంటారన్నారు. ఈ సదస్సులో ప్రధానంగా ఇంజనీరింగ్ సెక్షన్ లో పనిచేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలను నిర్ణయిస్తారన్నారు. అనంతరం మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం కార్మికులు, నాయకులు కమిషనర్ రామ్ భూపాల్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ సెక్షన్ నాయకులు గణేష్, రమణ, రామదాసు, పోతలయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిబంధనలు పాటించండి

నల్లచెరువు : మండల పరిధిలోని కదిరి - మదనపల్లి జాతీయ రహదారిపై బుధవారం గాజేఖాన్ పల్లి, గ్రామ క్రాస్ వద్ద డ్రైవర్ల కు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ లింగన్న, పోలీసులు పాల్గొన్నారు.

19 నుంచి నియోజకవర్గ పర్యటన

పుట్టపర్తి అర్బన్ : ఈనెల 19 నుంచి నియోజకవర్గ వ్యాప్తంగా చేపట్టే డాక్టర్ వైయస్సార్ రైతు విజయ సంకల్ప పాదయాత్రను చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన క్యాంపు కార్యాలయం నుంచి ప్రకటన విడుదల అయింది. ఈ పాదయాత్ర లో రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డి పాల్గొని నల్లగొండ రిజర్వాయర్ వద్ద పైలాన్ని ఆవిష్కరిస్తారని చెప్పారు. ప్రధానంగా 193 చెరువు నింపడానికి ప్రభుత్వం నూ. 864 కోట్లు మంజూరు చేసి జీవో విడుదల చేసిన నేపథ్యంలో ఈ విజయ సంకల్పయాత్ర కొనసాగుతుందని ఆ ప్రకటనలో తెలిపారు.

యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులుగా వంశీకృష్ణ

హిందూపురం : కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా హిందూపురం పట్టణానికి చెందిన ఎవి. వంశీకృష్ణను ఎంపిక చేస్తు రాష్ట్ర అధ్యక్షులు రామా రావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షులుగా ఉన్న వంశీకృష్ణ పార్టీకి చేసిన సేవలను గుర్తించి జిల్లా అధ్యక్ష భాధ్యతలను అప్పగించినట్లు నాయకులు తెలిపారు.

నేడు ధర్మవరంలో తాగునీటి సరఫరా బంద్

ధర్మవరం టౌన్ : ధర్మవరం మున్సిపాలిటీకి సంబంధించి తంబాపురం వాటర్ వర్క్స్‌లో పైపులైను లీకేజీ కారణంగా బుధవారం పట్టణంలో నీటి సరఫరాను బంద్ చేస్తున్నట్లు కమిషనర్ బండిశేషన్న బుధవారం తెలిపారు. గురువారం ఉదయం 7గంటల నుంచి రాత్రి 7గంటలవరకు నీటిసరఫరా బంద్ అవుతుందని పట్టణ ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

IN THE COURT OF THE JUNIOR CILVIL JUDGE :GOOTY
E.P. No. 38/2020 in O.S. No. 136/2018
BETWEEN:-
C. GOPAL ...PETITIONER-D.Hr.
AND
T.NARAYANA SWAMY @ A.NARAYANA SWAMY ...RESPONDENT-J.Dr.
Notice to the Respondent - J.Dr.
To
Thingadhala Narayanaswamy @ A.Narayanaswamy, S/o T. Nagaseshulu, Hindu, aged about 42 years, R/o Head Constable No.11, Dharmavaram Traffice Police Station, Puttaparthi District.
ORDER 21 RULE 48 NOTICE
పై అర్జీదారుడు నీ జీతమును జప్తు చేసి తనకు రావలసిన డిక్రీ మొత్తము వసూలు చేయుటకు గాను అర్జీని దాఖలు చేసుకొనినాడు. పై కేసు కోర్టు వారు 23/01/2024 వ తేది కి వాయిదా వేసినారు. కావున మీరు 23/01/2024వ తేదిన పగలు 10:30 గం॥లకు పై కోర్టు నందు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై ఏమైన అక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షము నందు తీర్మానించబడునని తెలుపడమైనది..
(By order of the court)
P.V.THIMMA REDDY,
Advocate For Petitioner-D-Hr

బెదిరింపులకు భయపడం

సోమందేపల్లిలోని సమ్మెలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్

బత్తలపల్లిలో సమ్మె నిర్వహిస్తున్నఅంగన్వాడీలు, నాయకులు

పుట్టపర్తిలో అంగన్వాడీల, నాయకుల నిరసన ర్యాలీ

ప్రజాశక్తి-సోమందేపల్లి

అంగన్వాడీ కార్మికులు గత 37 రోజులుగా న్యాయపరమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ సమ్మె చేస్తుండగా ప్రభుత్వ పెద్దలు డిమాండ్లు నెరవేర్చకపోగా బెదిరింపులకు పాల్పడుతున్నారని ఇలాంటి బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రికి తిరిగి అధికారంలోకి ఎలా రావాలని ఆలోచనలు తప్ప ప్రజా సమస్యలు పట్టడం లేదని విమర్శించారు. మహిళలు రోడ్లెక్కి పోరాటం చేస్తుంటే వారికి ఇచ్చిన మాటకు కట్టుబడి వారి డిమాండ్లను నెరవేర్చలేకపోతున్నారని అన్నారు. అంగన్వాడీలు చేస్తున్న ఆమరణ నిరాహార దీక్షకు సిపిఎం సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలియజేశారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్దన్న మాట్లాడుతూ అంగన్వాడీల డిమాండ్లు నెరవేర్చే వరకు ఆందోళన ఆగదని హెచ్చరించారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీదేవి ఆధ్వర్యంలో బుధవారం అంగన్వాడీ కార్మికులు స్థానిక సాయిబాబా గుడి ఆవరణ నుండి సిడిపిఒ కార్యాలయం వరకు నడుచుకుంటూ వెళ్లి ప్రభుత్వం ఇచ్చిన నోటీసులకు రిప్లై నోటీసులు అందజేశారు.

పెనుకొండ : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలో 37వ రోజు సమ్మెను కొనసాగించారు. ఈ సందర్భంగా తహాశీల్దార్ కార్యాలయం వద్ద నుండి ఐ సి డి ఎస్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీలకు ఇచ్చిన షోకాజ్ నోటీసులకు రిప్లై నోటీసులు ఇవ్వడానికి వెళితే సిడిపిఒ తీసుకోవడానికి నిరాకరించారు. దీంతో షోకాజ్ నోటీసులను ఆఫీస్ గోడలకు అతికించారు. చివరకు సిడిపిఒ వచ్చి రిప్లై నోటీసులు తీసుకున్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం బుధవారం నుండి విజయవాడలో ఆమరణ నిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయని తెలిపారు. సమ్మెను ఉధృతం చేయాలని రాష్ట్ర నాయకత్వం పిలుపునివ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు తిప్పన్న, అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు జయమ్మ, బావమ్మ, సెక్టార్ లీడర్లు మాబున్నీసా, వరలక్ష్మి, అనిత, శ్యామల గౌరి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు : ఓడీసీ, నల్లమాడ, అమడగూరు మండలాల అంగన్వాడీలు సిఐటియు ఆధ్వర్యంలో సమ్మె కొనసాగించారు. ఈసందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు లక్ష్మీనారాయణ అంగన్వాడీల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు సమ్మె కొనసాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు రంగమ్మ, మణిమాల, ,కిష్టమ్మ, కమలమ్మ, వరలక్ష్మి, అరుణమ్మ, అనసూయ, సుకన్యతో పాటు సిఐటియు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : అంగన్వాడీల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని సిపిఐ జిల్లాకార్యదర్శి వేమయ్య యాదవ్ విమర్శించారు. ఆంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారానికి 37వ రోజుకు చేరింది. ఈ సమ్మెకు సీపీఐ జిల్లాకార్యదర్శి వేమయ్య యాదవ్, ఏపీచేనేత కార్మికసంఘం తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటస్వామి, వెంకటనారాయణ, ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, సీపీఎం సీనియర్ నాయకుడు ఎస్ హెచ్ బాషా, సిఐటియు మండల అధ్యక్షులు ఎల్ఆదినారాయణలు సంఘీభావం తెలిపారు.

కదిరి అర్బన్ : అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 37వ రోజుకు చేరుకుంది. బుధవారం దీక్షా శిబిరం వద్ద డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు జయచంద్ర, ఐద్వా మహిళా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు సాయి లక్ష్మి మాట్లాడుతూ అంగన్వాడీలు న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని 37 రోజుల పాటు సమ్మెను కొనసాగిస్తుంటే సమ్మెను పరిష్కరించకపోగా సమ్మెను విచ్చినం చేయడానికి ఏస్మా చట్టాన్ని ఉపయోగించడం దారుణమన్నారు. షోకాజ్ నోటీసుల ద్వారా అంగన్వాడీలను భయపెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తోందన్నారు. ఈకార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు మాబున్నీసా, చంద్రకళ, సువర్ణ, లక్ష్మీదేవి, సుజాత, రామలక్ష్మమ్మతో పాటు సిఐటియు నాయకులు జిఎల్. నరసింహులు, జగన్మోహన్, ముస్తాక్, నాయకులు బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్: అంగన్వాడీల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు పోరాటం ఆగదని అంగన్వాడీ ప్రాజెక్టు, సిఐటియు నాయకులు పేర్కొన్నారు. బుధవారం పుట్టపర్తి, బుక్కపట్నం, కొత్తచెరువు, ప్రాజెక్టు అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు పుట్టపర్తిలోని సిడిపిఒ కార్యాలయానికి తరలివెళ్లి ప్రభుత్వం అందజేసిన షోకాజ్ నోటీసులకు బదులు నోటీసులు అందజేశారు. పుట్టపర్తి లోని సత్యమ్మ గుడి వద్ద నుండి సాయి నగర్ లోని సిడిపిఒ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీలో ప్రభుత్వంపై వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సాయి నగర్ లోని సిడిపిఒ కార్యాలయానికి చేరుకుని అక్కడ మూడు మండలాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు తమకు అందించిన నోటీసులను సిడిపిఒ గాయత్రికి వ్యక్తిగతంగా అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీల పట్ల ఎన్ని కవ్వింపు చర్యలకు పాల్పడినా అంగన్వాడీల పోరాటం సాగుతుందని న్యాయమైన సమస్యలను పరిష్కరించకుండా సమ్మెను విరమించమంటే ఏ విధంగా విరమిస్తామని తెలిపారు. అంగన్వాడీలను భయభ్రాంతులకు గురిచేసి విధులకు హాజరుకాకుండా హాజరైనట్టు లెక్కలు చూపుతున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు అంజి ప్రాజెక్టు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగమణి, పుట్టపర్తి ప్రాజెక్టు అధ్యక్షులు సుజాత కోశాధికారి మంజుల ప్రాజెక్టు లీడర్లు, భగవతి, అరుణ, అనిత, యశోద, అనంతమ్మ జ్యోతి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

నల్లచెరువు : ప్రాజెక్ట్ పరిధిలో ఉన్న తనకల్లు, నల్లచెరువు, గాండ్లపెంట మండలాలలోని అంగన్వాడీలు బుధవారం 37వ రోజు నల్లచెరువులో ర్యాలీ నిర్వహించారు. 37 రోజులుగా తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం ఎన్ని రకాలుగా ఇబ్బందులు సృష్టించినా తమ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు సమ్మె కొనసాగిస్తామని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన నోటీసులకు సమాధానంగా నల్లచెరువు ప్రాజెక్ట్ సిడిపిఒకు రిప్లై నోటీసులు అందజేసినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రామకృష్ణ, వేమన్న, రైతు సంఘం నాయకులు శివన్న, శ్రీరాములు, వ్యవసాయ కార్మిక సంఘం రమేష్, అంగన్వాడీ యూనయన్ నాయకులు పద్మావతి, లక్ష్మీ దేవి, భాగ్యమ్మ, అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించేదాకా ఆందోళన విరమించే ప్రసక్తే లేదని సిఐటియు శ్రామిక మహిళ కన్వీనర్ దిల్షాద్ అన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీలు 37రోజుల నుంచి నిరసన కార్యక్రమాలు చేపడుతున్నా ప్రభుత్వం తనకేమీ పట్టనట్లుగా వ్యవహరించడం బాధాకరమన్నారు. అంతకు ముందు బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాలకు చెందిన అంగన్వాడీలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిడిపిఒకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈకార్యక్రమంలో వాసంతి, రజియా వసంత, కృష్ణవేణి, సున్నిబేగం, జయసుధ, అరుణ, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

గుడిబండ : అంగన్వాడీలు తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం నాటికి 37వ రోజుకు చేరుకుంది. అమరాపురం, గుడిబండ మండలాలకు చెందిన అంగన్వాడీలు స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం ముందు సమ్మె చేపట్టారు. ఈ కార్యక్రమంలో గుడిబండ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు నాగమణి, కార్యదర్శి మహాదేవమ్మ, ఆయా మండలాలకు చెందిన సెక్టార్ లీడర్లు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

హిందూపురం : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని పట్టణంలోని సద్భావన్ సర్కిల్‌లో 37 రోజుల నుంచి నిర్వహిస్తున్న సమ్మె శిబిరాన్ని సిఐటియు జిల్లా నాయకులు సాంబశివ బుధవారం సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రభుత్వం అంగన్వాడీలకు ఇచ్చిన షోకాజ్ నోటీసులకు బదులుగా బుధవారం అంగనవాడీలంతా సమ్మె శిబిరం నుంచి పూలకుంట వద్ద ఉన్నా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యలయం వరకు ర్యాలీగా వెళ్లి అధికారిణికి సమాధానంతో కూడిన నోటీసులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్ట్ ప్రధాన కార్యదర్శి లావణ్య, ప్రాజెక్టు కోశాధికారి శిరీషా, నాయకులు శైలజ, నాగమ్మ, వరలక్ష్మి, పెద్ద ఎత్తున అంగన్వాడీలు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

కదిరి టౌన్ : పట్టణంలోని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకట ప్రసాద్ నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గాండ్లపెంట మండలం కటారుపల్లి క్రాస్ కు చెందిన పలువురు వైసీపీ నాయకులు టిడిపిలో చేరారు. కందికుంట వారందరికీ టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ లో స్థానిక నాయకత్వం మీద నమ్మకం లేదన్నారు. దీంతో పక్క జిల్లాకు చెందిన నాయకులు కదిరి నియోజకవర్గ ప్రజలపై ఆధిపత్యం చెలాయించాలని చూస్తున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో టీడీపీ జనసేన కూటమి అధికారం లోకి రావడం తథ్యమని అన్నారు. వైసిపి మండల మహిళా అధ్యక్షురాలు ఈశ్వరమ్మ, గాండ్లపెంట మండలం సోషల్ మీడియా కోఆర్డినేటర్ నాగరాజు, రమణయ్య, నరసింహులు, వెంగముని, గంగోజమ్మ, ఉత్తమ, వేమయ్య, తదితరులు ఈసందర్భంగా టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కొండయ్య, టిడిపి నాయకులు మేడ శంకర ,విశ్వనాథ్ రెడ్డి, చిన్నోడు, ఐటీడీపీ పవన్, గంగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పార్టీలోకి చేరిన వారితో కందికుంట

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు

కడప జోన్ ఛైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల

ప్రజాశక్తి పుట్టపర్తి క్రైమ్

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని ఆర్టీసీ కడప జోన్ ఛైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె బుధవారం స్థానిక ఆర్టీసీ డిపోను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈనెల 19న విజయవాడలో స్మృతి వనంలో 125 అడుగుల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రారంభిస్తారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఇంత పెద్ద విగ్రహం ఏర్పాటు చేయడం వల్ల సామాజిక న్యాయంపై ముఖ్యమంత్రికి ఉన్న చిత్తశుద్ధిని చాటుకున్నారన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ విగ్రహం ఆవిష్కరణకి డిపో ఉద్యోగులు హాజరుకావాలని ఆమె కోరారు ఆర్టీసీ ఉద్యోగులు ఈ విగ్రహ ఆవిష్కరణ కి తప్పకుండా హాజరు కావాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టిఎ పెద్దన్న, ఆర్టీసీ సెక్షన్ అధికారి ఉమాదేవి, ఏపీ ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధి బాబన్న, ముత్యాలు, నరసింహులు, రవణప్ప, ప్రసాద్, గ్యారేజీ సిబ్బంది, డిపో ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పూర్వవైభవం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

వైఎస్ఆర్ షర్మిల పీసీసీ అధ్యక్షురాలిగా నియమించడంతో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం రాబోతుందని కాంగ్రెస్ పార్టీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి అశ్వర్థనారాయణ పేర్కొన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దివంత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుమార్తె వైఎస్ షర్మిలను పీసీసీ అధ్యక్షురాలిగా నియమించడం శుభపరిణామమన్నారు. అదేవిధంగా గిడుగు రుద్రరాజును సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులుగా నియమించడం కూడా శు భపరిణామమన్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం రాబోతుందని, త్వరలో 52 మంది మాజీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు షర్మిల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరుతారన్నారు. రాహుల్ గాంధీ మణిపూర్ నుంచి పాదయాత్ర చేశారని అక్కడ కూడా అనూహ్య స్పందన వస్తోందని అన్నారు. ముఖ్యంగా ధర్మవరం నియోజకవర్గానికి వైఎస్ షర్మిలను పిలిపించి ఇక్కడ చేనేత కార్మికులు పడుతున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా చూపించి వారి సమస్యల పరిష్కారానికి కృషిచేసేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు షమీవుల్లా, మైనార్టీ పట్టణ అధ్యక్షులు కరీం, డీసీసీ డైరెక్టర్ సయ్యద్ తాహీర్, జనరల్ సెక్రటరీ మునాఫ్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

ఇన్సెంటివ్ విడుదల చేసే వరకు బంద్ కొనసాగిస్తాం

ధర్మవరంలో సమ్మె చేస్తున్న పట్టురైతులు, రీలర్లు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఇన్సెంటీవ్‌ను విడుదల చేసే వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పట్టుగూళ్ల మార్కెట్ల బంద్ కొనసాగిస్తామని పట్టు రైతు సంఘం నాయకులు అన్నారు. ఇన్సెంటీవ్ విడుదల చేయాలని డిమెండ్ చేస్తు బుధవారం పట్టణంలోని పట్టు గూళ్ల మార్కెట్‌ను బంద్ చేసి పట్టు రైతులతో కలసి దీక్ష చేపట్టారు. వీరి ఆందోళనకు కాంగ్రెస్ నాయకులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా పట్టు రైతు సంఘం రాష్ట్ర నాయకులు ధనపూరం వెంకట్రామిరెడ్డి, సుబ్బిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బాలాజీ మనోహర్ మాట్లాడుతు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రైతులను అన్ని విదాల ఆదుకుంటామని చెప్పి పట్టు రైతులను పూర్తి విస్మరించారన్నారు. 2017 నుంచి ఇన్సెంటీవ్ రావాల్సి ఉంటే గతంలో చేసిన ఆందోళనకు కొద్దిగా విడుదల చేశారన్నారు. 2019 నుంచి ఇప్పటి వరకు ఒక్క హిందూపురం పట్టు గూళ్ల మార్కెట్‌కు సంబందించి పట్టు రైతులకు రూ.17 కోట్లు, రీలర్లకు రూ.3కోట్లు రావాల్సి ఉందన్నారు. ఇదే రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు రూ. 66 కోట్లు బకాయిలు ఉన్నాయన్నారు. ఈ బకాయిలు విడుదల గురించి ఇప్పటి వరకు 12 సార్లు ప్రభుత్వ పెద్దలను కలిసి సమస్యను వివరించామన్నారు. దీంతో పాటు రైతు సదస్సును హిందూపురం పట్టు గూళ్ల మార్కెట్‌లో ఏర్పాటు చేసి, ఈ సదస్సుకు రాష్ట్ర వ్యవసాయ శాక మంత్రి కన్నబాబును, సిరికల్చర్ కమిషనర్‌ను ఆహ్వానించి సమస్యలను వివరించామన్నారు. ఆ సమయంలో వెంటనే ముఖ్యమంత్రికి వివరించి, 15 రోజుల్లో బకాయిలు విడుదల చేస్తామని చెప్పి మూడేళ్ళు గడుస్తున్న మూడు రూపాయల ఇన్సెంటీవ్ విడుదల చేయలేదన్నారు. ఇన్సెంటీవ్ విడుదల చేసే వరకు పట్టు రైతులకు ఎంత నష్టం వచ్చిన లెక్క చేయకుండా మార్కెట్‌లను బంద్ కొనసాగిస్తుమన్నారు. ఈ కార్యక్రమంలో పట్టు రైతు సంఘం నాయకులు సిద్దా రెడ్డి, జయరామిరెడ్డి, సోమ కుమార్, హనుమంతరెడ్డి, రీలర్లు ముస్తపా, అన్సార్, ఖలీల్, కాంగ్రెస్ నాయకులు అమానుల్లా, జమీల్, తిరుపాల్, రామాంజినేయులతో పాటు పట్టు రైతులు, రీలర్లు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : వైఎస్ జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పాదయాత్రలో పట్టురైతులకు, రీలర్లకు ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా వారిని మోసం చేశారని ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న విమర్శించారు. ఐదేళ్లగా పెండింగ్లో ఉన్న ఇన్సెంటీవ్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ స్థానిక సిరికల్చర్ కార్యాలయం వద్ద పట్టు రైతులు, రీలర్లు సమ్మె చేపట్టారు. ఈ సమ్మెకు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జం గాలపల్లి పెద్దన్న, సిపిఎం నాయకులు ఎస్‌హెచ్. భాషా తదితరులు సంఘీబావం ప్రకటించారు. ఈ సందర్భంగా జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూరాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పట్టురైతులకు రూ.67కోట్లు బకాయిలను వెంటనే ఇవ్వాలన్నారు. ఇందులో ధర్మవరం సిరికల్చర్ కార్యాలయ పరిధిలో 500 మంది రైతులకు రూ.10 కోట్ల దాకా ఇన్సెంటివ్ బకాయిలు రావాల్సి ఉందన్నారు.

'పురం'లో చోరీ

హిందూపురం : పట్టణంలోని ధన్ రోడ్డులోని శ్రీనివాస ఐటిఐ ఎదురుగా నివాసం ఉంటున్న నయూమ్ ఇంటిని దొంగలు కొల్లగొట్టారు. నయూమ్ ఇంటి పై కప్పును పగలగొట్టిన దుండగులు ఇంటిలో ఉన్న రూ.2.50లక్షల నగదుతో పాటు 18 తులాల బంగారం దొంగలించారని బాధితుడు పోలీసులకు బుధవారం ఫిర్యాదు ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎమ్మెల్యే కారు డ్రైవర్ పై ఫిర్యాదు

మడకశిర రూరల్ : మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామి కారు డ్రైవర్ ధనుపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రవి శేఖర్ రెడ్డి, రంగయ్య గౌడ్, అమరాపురం సర్పంచి వాగేష్ తెలిపారు. బుధవారం సాయంత్రం మడకశిరలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్యే కారు డ్రైవర్ ధను సోషల్ మీడియా, అతని ఫేస్ బుక్ లో బెదిరింపు చర్యలకు పాల్పడటంతో పోలీసులకు ఫిర్యాదు చేసామని చెప్పారు. వీరి చర్యలను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళతామన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలకు డిమాండ్

రొద్దం : మండలంలో మూడు రోజుల క్రితం జరిగిన చిన్నపాటి గొడవను పెద్దదిగా మార్చి దళితులను ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అణగదొక్కాలని చూస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ జిల్లా నాయకులు రమణ డిఆమండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత యువకుడిపై దాడి చేసి దళితులు ఇండ్లలో దాక్కునే విధంగా భయభ్రాంతులకు గురి చేసిన రొద్దం గ్రామానికి చెందిన వారిపై ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కెవిపిఎస్, బహుజన చైతన్య వేదిక ఆధ్వర్యంలో పోలీసులకు ఫిర్యాదు చేసినటు చెప్పారు. ఈ కార్యక్రమంలో బహుజన చైతన్య వేదిక నాయకులు లాయర్ శివరామకృష్ణ, కెవిపిఎస్ నాయకులు జ్యోతమ్మ, నారాయణ, వెంకటేష్, మూర్తి, బాబు ప్రసాద్, శంకర్ శీన పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి

ఓబుళదేవర చెరువు : వచ్చే వేసవికాలంలో ప్రతి ఒక్కరూ ఉపాధి పనికి వచ్చేలా చూడాల్సిన బాధ్యత క్షేత్రస్థాయి సిబ్బందిపై ఉందని ఏపీవో సోమశేఖర్, ఎంపీడీవో సిద్ధారెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవికాలంలో కూలీలకు వ్యవసాయ పనులు ఉండవన్నారు. ఈనేపథ్యంలో వారిని ఉపాధి హామీ పనులకు వచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. 2024, 25 సంవత్సరానికి సంబంధించి పండ్లతోటల పెంపకం పై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఈసీ ఆంజనేయులు, సాంకేతిక సహాయకులు రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీల అభివృద్ధికి చర్యలు

బత్తలపల్లి : గ్రామ పంచాయతీల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో సాయిమనోహర్ పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో రెండు రోజుల శిక్షణా తరగతులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచులు, వార్డు మెంబర్లు, సచివాలయ ఉద్యోగులు గ్రామ పంచాయతీల అభివృద్ధిపై సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. పంచాయతీల అభివద్ధికి తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఆనంతరం వివిధ అంశాలపైన శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి వేడుకలు

ముదిగుబ్బ : మండల కేంద్రంలో బస్సు షెల్టర్ సమీపాన కాపు సంక్షేమ సేన ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయల 553 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రాయల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించి మూడు రోడ్ల కూడలిలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కాపు సంక్షేమ సేన అధ్యక్షులు కావేటి అశోక్ కుమార్, ఉపాధ్యక్షులు నారాయణస్వామి, నరేష్ , జిల్లా గౌరవ సలహాదారు దేగల వెంకట్, జిల్లా కార్యదర్శి కోన చంద్రశేఖర్, సలహాదారు కురిమి శెట్టి గోవింద్ , కిషోర్, బొగ్గు రాజశేఖర్, గుర్రం జయచంద్ర , కరుణాకర్, రెడ్డప్ప , కాసేటి రెడ్డప్ప, చంద్ర, నాగభూషణం, హరి, కిషోర్ పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

హిందూపురం : పట్టణంలోని సప్తగిరి జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో బుధవారం పరిగి మండలం సేవా మందిర్ లోని అందుల పాఠశాలలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాన్ని ప్రారంభించారు. ఎస్కేయు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మురళీధర్ రావు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మంజునాథ్ మాట్లాడుతూ ఈ శిబిరం ఈ నెల 23 వరకు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంధుల పాఠశాల ప్రిన్సిపల్ అబ్దుల్ కరీం, సర్పంచి నాగభూషణం, ఎంపీటీసీ మారుతీ రెడ్డి, ఎన్ఎస్ఎస్ పిఒ ప్రకాశ్‌రెడ్డి, నాగేందర్ రెడ్డి, సప్తగిరి సప్తగిరి కళాశాల ఎఒ గంగిరెడ్డి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిపోటీలకు ధర్మవరం క్రీడాకారిణి

ధర్మవరం టౌన్ : రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ పోటీలకు ధర్మవరంపట్టణానికి చెందిన క్రీడాకారిణి నవ్య ఎంపికైనట్టు కోచ్ పృథ్వీ తెలిపారు. ఈ నెల 15వతేదీ నుంచి గుంతకల్లులో జరిగిన ఉమ్మడిజిల్లా స్థాయి కబడ్డీ పోటీలలో నవ్య ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపికైందన్నారు. ఈ పోటీలు నంద్యాలలో ఈనెల 20వతేదీ నుంచి 23 వరకు జరుగుతాయని చెప్పారు. ఈ నేపథ్యంలో బుధవారం ధర్మవరం క్రీడామైదానంలో కోచ్‌తో పాటు ఆర్డీటీ ఆర్డీ ప్రమీల, ఏటీఎల్ శ్రీనివాసులు, హాకీ కోచ్ అనిల్ , క్రికెట్ కోచ్ రాజశేఖర్ తదితరులు క్రీడాకారిణి నవ్యను అభినందించారు.